వున్నంత కాలం.... మన అబ్బాయిలకు మంచి సంబంధాలు దొరుకుతా...."

"ఛఛ.... అవేం మాటలండీ" అంటూ భర్త నోటిని తనచేత్తో మూసేసింది సావిత్రమ్మ.

# హృదయం

గుత్తుల భాస్కరరావు



నీల పదో క్లాసు పాసై ఫ్రెష్‌గా కాలేజీలో అడుగు పెట్టేముందు—

తల్లి చేరదీసి 'అమ్మడూ' అంటూ ప్రారంభించి కొన్ని జాగ్రత్తలు చెప్పింది. బైట ఎదురయ్యే ప్రమాదాలు గుర్తించాలని హెచ్చరించింది. యింకా....

"కాలేజీ అంటేనే అదో కొత్త ప్రపంచం. ఆడపిల్లవు నీ పరిధీ.పదతితెలుసుకుని మసులుకోవాలి. మగపిల్లలతో ఎలా వేగుకొస్తావో! ఆ వెధవలు నిన్నటివరకూ టెన్త్ క్లాస్ నీతో కలిసి చదివి వుండొచ్చు. అప్పటికి వాళ్ళు నిక్కరుగాళ్ళే కావచ్చు. కాలేజీ అనేసరికి కొత్తగా కొమ్ములొస్తాయి. పాంట్లు తొడగడంతోటే పెద్ద హీరోలనుకుంటారు. ప్రతి ఆడపిల్ల వంక చెడచూపులు చూస్తారు. నీ హద్దుల్లో నువ్వుండాలి."

నీల అనుభవజ్ఞురాలిలా జవాబిచ్చింది : "నీకేం భయం లేదమ్మా. నా విషయంలో నిశ్చింతగా వుండు. నేను ఎవరివంకా చూడకపోతే — ఎవరో నా వంక చూస్తున్నారనే సమస్యేలేదు. నేను పట్టించుకోనమ్మా"

"భేష్ తల్లీ. చదువుమీదధ్యాసవుండాలి. చదువు పూర్తయ్యేవరకూ మరో ధ్యాస వుండకూడదు. ప్రతి కుర్రాడు ముందు ప్రేమ ప్రేమ అంటాడు. పెన్ అడిగినంత తేలిగ్గా హృదయం అడుగుతాడు. పెన్ యిచ్చినా పర్వాలేదుగానీ హృదయం పదిలం అమ్మడూ" అంది.

"నువ్వు పాతకాలందానివే అమ్మా. పెన్ మాత్రం ఎందుకిస్తానమ్మా?"

తల్లి మెచ్చుకొని ముద్దుగా మెటికలు విరిచి కూతుర్ని మొదటిరోజు కాలేజీకి సాగనంపింది.

ఒక పూట గడిచింది.

నీల లంచ్‌కి యింటికి వచ్చింది.

"అమ్మా ఒకడు అడిగాడే" అంది నీల.

తల్లి కంగారుగా "ఏమడిగాడే?"అంది.

"మీ పెన్ చాలా బావుంది. నాకు అచ్చంగా యిచ్చేయండి అని అడిగాడు."

"నువ్వేమన్నావ్?"

"ఇది నా స్వార్జితం కాదు. నా తల్లిదండ్రులు కొని యిచ్చిన వస్తువు. ఈ పెన్ మీద నాకు ఎటువంటి హక్కూ లేదు. నేనింకా వాళ్ళమీద ఆధారపడి వున్నాను. కాబట్టి నా పెన్ ఆశించకండి. అన్నాను. వాడి మొహం వాడిపోయింది" అంది సంతోషంగా.

ఆ తల్లి పొంగిపోయింది.

"అయినా అంత చర్చ పెంచకూడదు తల్లీ. ముందే కట్ చెయ్యాలి" అంది.

నీల భోంచేసి మధ్యాహ్నం కాలేజీకి వెళ్ళింది.

సాయంత్రం కాలేజీ అయిపోయింది. ఉరుకులు, పరుగులమీద యింటికి వచ్చేసింది.

"అమ్మా. అమ్మా" అంది వగరుస్తూ.

"మళ్ళా ఏం విశేషం నీలా?"

"విశేషమే. నా కాలేజీ ఫస్ట్‌డేనే జరిగింది."

"ఏవిటే?"

"ఇంకో స్టూడెంట్ .... డిగ్రీవాడు.... అడిగాడమ్మా."

"పెన్ అడిగాడా."

"కాదు. హృదయం కావాలన్నాడు"

"ఏమన్నావ్?"

"సారీ నేను అమ్మానాన్నల బిడ్డను. నాకే నామీద అధికారంలేదు. వాళ్ళు చెప్పినట్టు నడుచుకోడమే నా విధి అన్నాను."

"చాలు చక్కగా గడ్డిపెట్టావు. నువ్ కాలేజీలో తేలిగ్గా నెగ్గుకొస్తావు నీలా" అంది తల్లి.

"అమ్మా....అమ్మా"

"ఏవిటమ్మా?"

"అతను చాలా బావున్నాడమ్మా. వీధి మొగలో నిలబడ్డాడు. 'యిక్కడే వుండండి. మా అమ్మ పర్మిషన్ తీసుకొని వచ్చి మీకు హృదయం యిస్తా'నని మాట యిచ్చానే. నువ్ ఊఁ అనమ్మా."

---



## ఏడిస్తే.... ప్రెసిడెంట్ !

1840 లో యు. ఎస్. అధ్యక్షుని ఎన్నిక కోసం జరిగిన అంతరంగిక సమావేశంలో హెర్రిసన్ ఎన్నికయ్యాడు. హెన్రీ క్లే ఓటమిని భరించలేక అతని మిత్రుడు జాన్ టేలర్ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. దాంతో సమావేశం ఆయనను ఉపాధ్యక్షునిగా నియమించింది. ఆ తర్వాత నెలరోజులకు హెర్రిసన్ పదవిలో ఉండే పరమపదించాడు. టేలర్ అధ్యక్షుడయ్యాడు. ఏడిస్తే అదృష్టం వరిస్తుంది కాబోలు!!

---

## నిమ్మతొనలు!

పెళ్ళయిందనడానికి రుజువు
మెళ్ళో తాళి
కట్టకముందే అయ్యిందనుకుంటే
ఎగతాళి !

—'మాధవీ సనారా'